సాదుం జయరాం కథలు

# 5

# పుణ్యకాలం మించిపోయింది

"మీరు ఒక కథ రాయకూడదా!" అంది వరలక్ష్మి ఒక శుభోదయాన.

శ్రీమతి అభ్యర్ధన విన్న గోపాలక్రిష్ణకు ఆశ్చర్యం కలిగింది. రెండేళ్లకు పూర్వం ఎప్పుడన్నా వరలక్ష్మి ఇట్లా అడిగి ఉంటే ఆనంద పారవశ్యం అనుభవించేవాడు అతను. ఆ రోజులు పోయాయి. కారణాలు ఏమైతేనేం కానీ- చాలా రోజులుగా అతను కథలు రాయడమే మానుకున్నాడు. గతంలో తనూ ఒక కథకుడినన్న జ్ఞాపకాలు కూడా మెల్లమెల్లగా మరుగున పడుతున్నాయి.

ఈ స్థితిలో వరలక్ష్మి "ఒక కథ రాయకూడదా?" అని అడిగింది. చిత్రమేమిటంటే, తను కథలు రాస్తున్న రోజుల్లో, వరలక్ష్మికి తన కథలు కాబట్టలేదు. కాబట్టనందుకు అతనెప్పుడూ బాధపడలేదు. బాధాకరమైందేమిటంటే, అప్పట్లో వరలక్ష్మి ప్రవర్తన. గోపాలక్రిష్ణ కథలు రాయడం- వరలక్ష్మికి ఏమాత్రం గిట్టేది కాదు. "అర్ధరాత్రి దాకా- అపరాత్రి దాకా రాస్తూ కూర్చుంటే కరెంటు దండగ. ఆ రాసేదేమో ఉదయం రాసుకోవచ్చు. లైట్ ఆఫ్ చేసి పడుకుందురూ" అని విసుక్కునేది.

"కూటికి రావాలా? గుడ్డకు రావాలా? ఆ పొద్దుపోని రాతలు మానుకోండి" అని మండిపడేది.

అట్లాంటి వరలక్ష్మి ఇప్పుడు కథ రాయమని అభ్యర్ధించడం నిజంగానే గోపాలక్రిష్ణకు ఆశ్చర్యం కలగజేసింది.

"ఏమిటి విశేషం వరలక్ష్మీ?" అన్నాడు గోపాలక్రిష్ణ

"రాస్తానని మాట ఇవ్వండి" అంది ముసి ముసి నవ్వులు నవ్వుతూ వరలక్ష్మి.

"ముట్లుడిగినై. ఇంకా నేను రాసేదేమిటి?" అన్నాడు గోపాలక్రిష్ణ నవ్వుతూ.

"మీ పరాచికాలు చాల్లెండి. చిన్న కథ ఒకటి రాయడం బ్రహ్మ విద్యా? కూర్చుంటే అర్థగంటలో రాసి పారేస్తారు. నా మాట విని రాయండి" అంది ప్రాథేయపూర్వకంగా.

కొంతమందికి రాయడం కష్టమైతే, మరికొంతమందికి రాయకుండా ఉండటం కష్టం- అన్న సోమర్సెట్ మామ్ మాట ఒకటి గోపాలక్రిష్ణకు జ్ఞాపకం వచ్చింది. తను మొదటి కోవకు చెందినవాడు. ఇట్లాంటి విషయాలు వరలక్ష్మితో చర్చించి ప్రయోజనం లేదు.

"సరే ఇంతకూ ఏమిటి విశేషం?" అన్నాడు గోపాలక్రిష్ణ.

"చెబుతా నుండండి" అంటూ చెంగున ఇంట్లోకి పరుగెత్తి, ఏదో వారపత్రికతో ప్రత్యక్షమైంది. గబగబా పేజీలు తిప్పి "ఇదిగో ఈ ప్రకటన చూడండి" అంటూ వారపత్రిక గోపాలక్రిష్ణ చేతిలో ఉంచింది.

దీపావళి కథల పోటీకి సంబంధించిన ప్రకటన అది.

"చూశారా? మొదటి బహుమతి ఎంతో?" అంది కళ్లు ఇంతవి చేసి. ఆ కళ్లలో ఆశ్చర్యం, ఆశ రెండూ తొణికిసలాడుతున్నాయి.

గోపాలక్రిష్ణకు నవ్వు వచ్చింది.

"ఏం మనుషులండీ మీరు. పాతికా కాదు, పరకా కాదు రెండువేలు బహుమతి! మీకేమో నవ్వులాటలుగా ఉంది. కథ రాయరా?" అంది దీనంగా.

"అదికాదు వరలక్ష్మీ ప్రొఫెషనల్ మోరల్స్ అనేవి కొన్ని ఉన్నాయి. అదీ నా బాధ."

"అంటే?"

"అంటే ఏం లేదు. డాక్టరున్నాడనుకో- అతని వృత్తిధర్మం జబ్బుల్నుండి మనుషుల్ని రక్షించడం. ఈ బాధ్యతలో అతడు కేవలం డబ్బుకీ, వృత్తికీ లంకె పెట్టకూడదు. రచయిత అయినా అంతే. కేవలం డబ్బు కోసమని గడ్డి కరవకూడదు."

"మాటలకేం లెండి, ఈ రోజుల్లో డాక్టర్లకూ, లాయర్లకూ, అందరికీ డబ్బు రంది తప్ప మరొకటి లేదు. మీలాటి అమాయకులే ఆదర్శాలు మాట్లాడుతారు."

వరలక్ష్మి అన్నమాట వాస్తవమే. డాక్టరుకు రోగీ, లాయరుకు క్లయింటు- డబ్బు సంపాదించటానికి సాధనాలు తప్ప మరేమీ కాదు. రచయిత వృత్తికూడా అలాగే అయిపోతూంది.

"మనకు మాత్రం డబ్బు చేదా? రాయండి. ఏ పుట్టలో ఏ పాముందో ఎవరు చూచారు? మీ కథకే ప్రథమ బహుమతి రావచ్చు" అంది మళ్లీ వరలక్ష్మి.

"చూద్దాంలే" అన్నాడు గోపాలక్రిష్ణ.

మాట అనడమైతే అన్నాడు కానీ- పోటీకి కథ రాయాలన్న ధ్యాస అతనికి ఏ కోశానా లేదు. అందులో ఉన్న సాదక బాధకాలు అతనికి తెలియనివి కావు. ప్రజల అజ్ఞానం ఆసరాగా బ్రతుకుతున్న వారపత్రికలు! వాటికి ఎట్లాంటి కథలు నచ్చుతాయో- గోపాలక్రిష్ణ చూడంది కాదు. బహుమతి మొత్తం చూచి కళ్లు జిగేలుమని, వరలక్ష్మి ఏదో అడిగింది. కానీ దాన్ని అదేపనిగా సాగదీస్తుందని- గోపాలక్రిష్ణ ఊహించలేదు. రాత్రి భోజనం చేస్తుండగా వరలక్ష్మి "చెవుల్లోకి రింగులు కావాలని మాధవి ఉదయంనుంచి పోరుపెట్టి ఏడుస్తోందండీ" అంది.

ఆ పిల్లకు ఇంకా ఐదేళ్లు నిండలేదు. అప్పుడే దానికి సొమ్ములమీద మోజు. ఆడపిల్లలు పుట్టడంతోనే ఆభరణాలమీద మోజుతో పుడతారేమోననిపించింది గోపాలక్రిష్ణకు.

"రెండుకో, మూడుకో మంచివి రోల్డు గోల్డువి వస్తాయి. తీయించలేక పోయావా?"

"మీరు బొత్తిగా హృదయం లేని మనుషులు. ఐదో యేట దానికి మొదటిసారికిగా చెవులు కుట్టిస్తూ, రోల్డు గోల్డువి తగిలించాలా? ఈ మాట అనడానికి మీకు నోరు ఎలా వస్తోందండీ?"

"బంగారువే కాదు, ఖరీదయిన ముత్యాలు తాపినవి కొనాలని కూడా ఉంది. డబ్బు ఉండాలా లేదా?"

"డబ్బు దానంతటదే నడిచి మీ దగ్గరకు వస్తుందా?"

"నేనే దాని దగ్గరకు నడిచివెళ్తాను. ఆ మార్గమేదో చెప్పరాదూ?"

"నేను చెబితే మీ చెవి కెక్కుతుందా. కథరాయండి అని మొత్తుకుంటుంటే మీకు చీమ కుట్టినట్టన్నా లేదు."

అదీ మార్గం! ఆ మార్గం చెప్పడంలో వరలక్ష్మి నేర్పు గోపాలక్రిష్ణకు ఆశ్చర్యం కలుగజేసింది. నేరుగా విషయంలోకి దిగకుండా, పిల్లదాని ఇయర్ రింగుతో మొదలెట్టడం- మధ్యలో హృదయం ప్రసక్తి తెచ్చి సెంటిమెంటుమీద ప్లే చెయ్యడం- ఆ తర్వాత కథ రాయమని అడగడం- ఇదంతా చూస్తే రచయిత్రికి కావలసిన లక్షణాలు- వరలక్ష్మిలో కూడా ఉన్నవేమోననిపించింది గోపాలక్రిష్ణకు.

"నువ్వే కథ ఒకటి ఎందుకు రాయకూడదు వరలక్ష్మీ! కథ రాయడానికి నీకున్న పరిజ్ఞానం చాలు. ప్రతిభ పాళ్లు కొంచెం ఎక్కువైతే, పత్రికలవాళ్ళకీ జీర్ణం కాదు. నీలాంటివాళ్ల అవసరం ఇప్పుడు దేశంలో చాలా వుంది" అన్నాడు గోపాలక్రిష్ణ నవ్వుతూ.

"మీ సరసాలు కట్టిపెట్టి, అన్నం తినగానే రాయడానికి కూర్చోండి. కాగితాలూ, పెన్నూ అన్నీ టేబుల్ మీద సిద్ధంగా పెట్టాను" అంది వరలక్ష్మి.

"ఏ తమిళనాడు లాటరీ టిక్కెట్టో కొని నీ అదృష్టం పరీక్షించుకోక నాప్రాణమెందుకు తీస్తావు?"

"నన్నుద్ధరించడానికి మిమ్మల్ని కథ రాయమని బలవంతం చేయడం లేదు. ఇంటి పరిస్థితులెంత చెప్పినా మీకు అర్థంకావేం? వచ్చే జీతంలో మార్వాడీ వడ్డీకింద ఎంత పోతోందో, ఎంత మిగులుతోందో మీకు తెలియందా? తినీ తినకా చస్తున్నా, సంసారం గడవడం గగనమై పోతూంది. ఎప్పుడో చేసిన అప్పులు ఈనాటికీ తీరే దారిలేదు. అయినా ఇవన్నీ మీతో అనడం నాదే బుద్ధి తక్కువ" అంది మూతి బిగించి.

ఇంట్లో పోరు ప్రారంభం కాకూడదు. అయ్యాక దాని పరిణామాలు ఎలా ఉంటాయో గోపాలక్రిష్ణకు తెలియంది కాదు. పరిస్థితులు అందాకా విషమించకుండా- వరలక్ష్మి, మాట పాటించి, ఒక పట్టుపట్టి చూడటమే మేలు అనుకున్నాడు గోపాలక్రిష్ణ. అన్నం తినగానే వెళ్లి టేబుల్ ముందు కూచున్నాడు.

వరలక్ష్మి చెప్పినట్టు అన్నీ సిద్ధంగా ఉన్నాయి.

మెదడు మాత్రం పనిచెయ్యడానికి సిద్దంగా లేనంటోంది. చిన్నప్పుడు ప్రైవేట్ ట్యూషన్‌కు, టీచరు ఇంటి దగ్గరికి వెళ్లే దినాలు జ్ఞాపకానికి వచ్చాయి గోపాలక్రిష్ణకు.

వరలక్ష్మి భోంచేసి, ఇల్లు సర్ది బయటకు వెళ్తూ గోపాలక్రిష్ణ గదిలోకి తొంగి చూసింది. చెప్పినట్టు విని బుద్ధిమంతుడిలా రాయడానికి కూర్చున్నాడు. వరలక్ష్మి ముఖం విప్పారింది.

"టేబుల్ సొరుగులో సిగరెట్టు పెట్టెలున్నాయి. ఫ్లాస్కులో కాఫీ మూడు కప్పులు పోశాను, చాలు గదా?'' అంది.

"చాలు.''

"చెప్పడం మరిచాను. గడువు నాలుగు రోజులే ఉంది. ఆ పత్రిక ముందన్నా నా కంటపడింది కాదు'' అంది నొచ్చుకుంటూ.

"ఇన్‌స్పిరేషన్ వుంటే ఎంతసేపు వరలక్ష్మి? ఏడుస్తూ రెవిక ముడి విప్పడమంటారే- అట్లా వుంది నా పరిస్థితి.''

"మీరూ, మీ బూతుమాటలూ! ఇన్‌స్పిరేషన్ రావడానికి ఏం కావాలి?'' అంది నవ్వుతూ.

"అదిగో, ఆ అలమరాలో కథల పుస్తకాలు ఉన్నాయి. అవి ఇట్లా పడేయ్. అవి చదివితేనన్నా ఇన్‌స్పిరేషన్ వస్తుందేమో చూస్తాను'' అన్నాడు గోపాలక్రిష్ణ.

పై ఉద్యోగి మాట సబార్డినేట్ శిరసావహించినట్టు, వరలక్ష్మి గబగబా వెళ్లి కథల పుస్తకాలు తెచ్చి టేబిల్ మీద వేసి వెళ్లిపోయింది.

చాలాసేపు చదువుతూ కూర్చున్నాడు. ఏదన్నా చదువుతూ కూర్చుంటేనన్నా ఇన్‌స్పిరేషన్ వస్తుందేమోనని ఆశ. కాని అదేం లాభించలేదు. తను రాయడమన్నది- రెక్కలు విరిగిన పక్షి ఎగరడానికి ప్రయత్నించినట్టుగా ఉంది. తలలో ఏదో శూన్యం! ఒకప్పుడు తను నిజంగా కథలు రాశాడా అనిపించింది. తనలోని రచయిత చచ్చిపోయాడేమో! ఎప్పుడు ప్రయత్నించినా తను ఇంక రాయలేడేమో! తన అశక్తతమీద తనకే జాలివేసింది. ఏదో బాధ! టేబుల్ మీద తల ఆన్చి అలాగే పడుకున్నాడు.

పన్డ్రెండింటికి గదిలో అడుగుల చప్పుడైతే తలెత్తి చూశాడు. వరలక్ష్మి! ఆమె నిద్రపోలేదు. ఎవరి బాధ వారిది!

"కథ ఎందాకా వచ్చింది?''

"డైలాగులతో సహా అన్నీ తలలో ఉన్నాయి. కాగితంమీద పెట్టడమే తరువాయి, ఉదయం ఆ పని చేస్తాను వరలక్ష్మి!'' అంటూ ఒక చిన్న అబద్ధం ఆడాడు గోపాలక్రిష్ణ.

"పొద్దుపోయింది వచ్చి పడుకోండి'' అంది వరలక్ష్మి.

పడుకున్నాడు కాని గోపాలక్రిష్ణకు నిద్ర రాలేదు. తను రాయలేని స్థితే జ్ఞాపకం వస్తోంది. తను ఇట్లా బాధపడుతుంటే, వరలక్ష్మికేమో బహుమతి మొత్తం అబ్సెషన్ లాగా తయారయింది. ఉదయం లేవగానే మళ్లీ కథ అని వెంటపడుతుంది. బాధ... చిరాకు- వీటిమధ్య ఏ ఒంటిగంటకో నిద్ర పట్టింది.

బాగా పొద్దెక్కిన తర్వాత లేచి పళ్లు తోముకుంటున్నాడు.

వరలక్ష్మి రెండు ఉత్తరాలు పట్టుకొచ్చింది.

"ఎక్కడ్నుంచో! చదువు'' అన్నాడు గోపాలక్రిష్ణ. వరలక్ష్మి ఒక కార్డు తీసి చదివి, "ఎవరో కేశవరావు అనే ఆయన రాశాడండీ ఈ ఉత్తరం. కథా సంకలనానికి ఒక కథ రాసి పంపమంటున్నాడండీ'' అంది.

కథ అనగానే కంపరం పుట్టుకొచ్చింది. వరలక్ష్మితోనే ఏగలేక చస్తూంటే మళ్లా ఇదొకటి. "సరేలే, ఆ ఉత్తరం ఎక్కణ్ణుంచో చదువు" అన్నాడు గోపాలక్రిష్ణ

"చదువుతాను గానీ, కథ రాసి పంపితే వీళ్లేమైనా డబ్బు ఇస్తారా?" అని ప్రశ్నించింది వరలక్ష్మి.

"ఇవ్వరు"

"అయితే చేతి చమురు భాగోతమన్న మాట. వీళ్లకు కథ పంపకండి" అంది- రెండో ఉత్తరం చదవడానికి మొదలుపెడుతూ.

పత్రికలవాళ్లు పాతికో, పరకో ముట్టజెబితే తీసుకున్న మాట వాస్తవమేకానీ, డబ్బు కోసమని తను ఏనాడూ కథలు రాయలేదు. రాయాలనిపించినప్పుడు రాశాడు. సామాజిక బాధ్యత నిర్వర్తించాననే తృప్తి అనుభవించేవాడు. ఇప్పుడు అదీ దూరమైపోయింది. ఏదో బాధ గొంతులో ఉండలా అడ్డుపడింది గోపాలక్రిష్ణకు.

"అయ్యయ్యో" అంది బాధగా వరలక్ష్మి ఉత్తరం చదివి.

"ఏమైంది వరలక్ష్మీ?" అన్నాడు గోపాలక్రిష్ణ

"మీ అక్కకు సీరియస్‌గా ఉందట, మీ మేనల్లుడు వాసు ఉత్తరం రాశాడు" అంది వరలక్ష్మి.

"తొమ్మిదింటికి బస్సు ఉంది- మధ్యాహ్నానికి చేరుకోవచ్చు. త్వరగా కాఫీ ఇవ్వు. వెళ్తా" అన్నాడు ఆత్రంగా గోపాలక్రిష్ణ

"కాఫీదేముంది. త్వరగా ముఖం కడుక్కోండి. మళ్లా సాయంత్రానికి వస్తారుకదా?"

కథ పంపడానికి గడువు నాలుగు రోజులే ఉందని రాత్రి వరలక్ష్మి అన్నమాట జ్ఞాపకం వచ్చింది. అందుకే సాయంత్రానికి ఇంటికి రారా అని అడుగుతున్నదేమో! గోపాలక్రిష్ణకు జుగుప్స కలిగింది. అమితమైన కోపం వచ్చింది. గబగబా ముఖం కడుక్కొని కాఫీ త్రాగకుండా బయలుదేరాడు.

గోపాలక్రిష్ణ వెళ్లేసరికి అంతా అయిపోయింది.

"ఏమైందిరా వాసూ?" అన్నాడు గోపాలక్రిష్ణ గాద్గదికమైన గొంతుతో.

"మన పిచ్చిగానీ, అరవై ఏళ్లు నిండాయి, ఇంకా ఎన్నేళ్లు బ్రతుకుతుంది మామా!"

"గోపాల్ కనిపించడేం?"

చెప్పుకుంటే సిగ్గుచేటు. అమ్మ తన పేర ఉన్న నాలుగెకరాల ఆస్తి, పోయిన సంవత్సరం నా పేర రాయించింది. ఆ కోపంతో ఇప్పుడు కడసారి కళ్లచూడటానికన్నా రాలేదు, ప్చ్" అని చప్పరించాడు.

గోపాలక్రిష్ణ మనసు కలుక్కుమంది. కన్నతల్లి చనిపోతే కూడా చూడటానికి రాని కొడుకు! నవమాసాలూ మోసి కనడం మాట అటుంచినా- అతనికబ్బిన చదువూ, మంచి ఉద్యోగమూ కూడా ఆమె శ్రమ ఫలితమే. నానా యాతనా పడి చదివించి ఉద్యోగస్తుణ్ణి చేసింది. ఇంతా చేసినా పగ సాధిస్తున్నాడు!

చీకటి పడ్డాక దహన సంస్కారాలు పూర్తి అయ్యాయి. ఆరోజు రాత్రికి అక్కడే ఉండి మరుసటి రోజు వస్తున్నాడు గోపాలక్రిష్ణ. ఊరి బయట శేషయ్య కనిపించాడు. గోపాలక్రిష్ణకు ఆయన కొంచెం దూరపు బంధువు.

"వెళుతున్నావా నాయనా?" అన్నాడు.

"ఇంకేముంది. అంతా అయిపోయింది. వెళుతున్నాను." అన్నాడు గోపాలక్రిష్ణ

"కాలం తీరిన తర్వాత ఎవరూ ఇక్కడ ఉట్టి కట్టుకొని ఊరేగేది లేదు, బాధేమిటంటే అవసాన దశలో ఆ మహాతల్లికి కొడుకులుండీ లేనట్లే అయింది"

"అవును, గోపాల్ చూడనన్నా రాలేదు."

"వాడు మన్నూ, వీడు దుమ్మూ, వీడిక్కడ వుండి ఉద్ధరించాడనుకుంటున్నావా?" అన్నాడు శేషయ్య.

"ఏం? ?ను సరిగా చూడలేదా?" అన్నాడు ఆశ్చర్యంగా గోపాలక్రిష్ణ.

"చూచేవాడే. వీని తప్పులేదు. దరిద్రంలో ఉన్నాడని తన పేర ఉన్న నాలుగెకరాలు, ఆ మహాతల్లి వీడి పేర రాయడం తప్పయింది. అప్పట్నుంచి ఈమె చావుకు ఎదురుచూస్తూ కూచున్నాడు. పదిరోజులుగా జ్వరం, మందో మాకో ఇప్పించాలన్న ధ్యాస కూడా లేకపోయింది వీడికి."

గోపాలక్రిష్ణకు అక్కడ నిలబడి మాట్లాడాలనిపించలేదు. తల తిరిగినట్టుగా ఉంది. బస్సులో కూర్చున్నాడు. శేషయ్య అన్న మాటలే జ్ఞాపకం వస్తున్నాయి. కడుపులో చేయిపెట్టి దేవినట్టుగా ఉంది. డబ్బు... అది రూపంలేని రాక్షసి! దాని కబంధ హస్తాల్లో- మమతలు, మమకారాలు- బంధాలూ, అనుబంధాలు- అన్నీ ఊపిరాడక చస్తున్నాయి. తల్లీ లేదు తండ్రీ లేదు!

గోపాలక్రిష్ణ ఇంటికి రాగానే "ఎట్లా ఉంది పిన్నికి?" అంది వరలక్ష్మి.

వెళ్లేటప్పుడు వరలక్ష్మి మీద ఉన్న కోపం ఇప్పుడు లేదు. "చనిపోయింది" అన్నాడు బాధగా.

"కాళ్లు కడుక్కుని భోంచేద్దురు రండి" అంది వరలక్ష్మి. ఆ మాట గోపాలక్రిష్ణకు వినిపించలేదు. దయ్యంపట్టినట్టు నడిచి వెళ్లి టేబుల్ ముందు కూచున్నాడు. చాలారోజుల తర్వాత అతనిలోని రచయిత మేల్కొన్నాడు. వానికి ఇప్పుడు అన్నమూ, నీళ్లూ కాదు కావలసింది. లోపలి మంట బయటకు కక్కాలి, గోపాలక్రిష్ణ రాస్తూ కూర్చున్నాడు.

చాలాసేపటికి వరలక్ష్మి వెళ్లి "భోంచెయ్యకుండా ఏం చేస్తున్నారు?" అంది.

"కథ రాశాను వరలక్ష్మీ!" అన్నాడు గోపాలక్రిష్ణ.

"రేపు ఆదివారం. ఎల్లుండి కథ పంపినా, గడువు లోపల చేరదు. పోనీ సంకలనానికి పంపుకోండి" అంది దిగులుగా.

అతని కళ్లల్లో ప్రతిఫలిస్తున్న స్పిరిచువల్ శాటిస్ఫాక్షన్ ఆమె గమనించనేలేదు!

- ('సుడి' సంకలనం - 1973)